పల్లె దవాఖానాలపై పట్టింపేదీ?

- చెన్నారిగూడెంలో నిర్మాణం పూర్తయినా వినియోగంలోకి రాని వైనం
- నారాయణపురంలో నత్తనడకన నడుస్తున్న నిర్మాణ పనులు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు



చెన్నారిగూడెంలో నిరుపయోగంగా ఉన్న పల్లె దవాఖానా



నారాయణపురంలో నత్తనడకన సాగుతున్న హెల్త్ సెంటర్ పనులు

చిలుకూరు : గ్రామాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పల్లె దవాఖానాలు నిర్మించాలని సంకల్పించి. ఈ నేపథ్యంలో లక్షల రూపాయాలు వెచ్చించి ఆయా గ్రామాల్లో నిర్మాణాలు చేపట్టింది. కాని అధికారుల పట్టింపు, పర్యవేక్షణ లేకపోవడంతో ఆ భవనాల నిర్మాణ పనులు నత్తనడకన నిర్లక్ష్యంగా సాగుతున్నాయి. దీంతో ప్రభుత్వ లక్ష్యం నేరవేరకుండా పోతుంది. గ్రామాల్లో ప్రజలకు మెరుగైన వైద్యం అందుబాటులో అందించాలనే లక్ష్యంతో సంవత్సరం క్రితం మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి అనుబంధంగా మండలంలోని పలు గ్రామాల్లో పల్లె దవాఖానాలను నిర్మించేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. సంవత్సరం క్రితం చెన్నారిగూడెం గ్రామంలో పల్లె దవాఖానాకు నిర్మించేందుకు ప్రభుత్వం రూ.12లక్షలు మంజూరు చేసింది. అక్కడ నిర్మాణాలు పూర్తయినా భవనం వినియోగంలోకి రావడంలేదు. అదే విధంగా ఇటీవల మండల పరిధిలోని జెర్రిపోతులగూడెం, దూదియాతండా, రామాపురం, నారాయణపురం, చిలుకూరు గ్రామాల్లో పల్లె దవాఖానాలను నిర్మించేందుకు ఒక్కో సెంటర్‌కు ప్రభుత్వం రూ.20లక్షలు మంజూరు చేసింది.

చెన్నారిగూడెంలో రూ.12లక్షలతో నిర్మించినా అందని వైద్యసేవలు..

మండలంలోని చెన్నారిగూడెం గ్రామంలో పల్లె దవాఖానాకు ప్రభుత్వం రూ.12లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో హెల్త్ సబ్‌సెంటర్ (పల్లెదవాఖానా)ను అన్ని హంగులతో కార్పొరేట్ వైద్యశాలకు దీటుగా నిర్మించారు. నిర్మాణం పూర్తియి నెలలు గడుస్తున్నా నేటి వరకు సబ్‌సెంటర్‌ను ప్రారంభించలేదు. దీంతో చెన్నారిగూడెంతో పాటు చుట్టు పక్కల గ్రామాల వారు వైద్యానికి దూరవుతున్నారు. ఎన్నికల కోడ్ రాకముందు ప్రారంభిస్తారని అనుకున్న గ్రామస్తులకు చేదు అనుభవం ఎదురైంది. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉండడంతో నేడు ప్రారంభించే పరిస్థితి లేదు. దీంతో గ్రామస్తులు భవనం నిర్మించి కూడా ఉపయోగం లేదని వాపోతున్నారు.

మందకొడిగా భవనాల నిర్మాణ పనులు..

మండలంలోని జెర్రిపోతులగూడెం, దూదియా తండా, రామాపురం, నారాయణపురం, చిలుకూరు గ్రామాల్లో పల్లె దవాఖాలను నిర్మించేందుకు నిధులు మంజూరై నెలలు గడుస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో నేటి వరకు పనులు 20శాతం కూడా పూర్తికాలేదు. పనులు గ్రౌండ్ లెవల్‌లోనే మట్టి తోలకం దశలోనే నత్తనడకన నడుస్తున్నాయి. దీంతో ప్రభుత్వం నిధులు మంజూరు చేసిన ఫలితం మాత్రం ఉండడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి పనులు త్వరితగతిన పూర్తి చేసి పల్లెదవాఖాలను వినియోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కేవీకే శాస్త్రవేత్తకు 'రైతునేస్తం పద్మశ్రీ' అవార్డు



మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న కిరణ్

గరిడేపల్లి : వ్యవసాయ అనుబంధ రంగాల్లో విశేష ప్రతిభ కనబపర్చిన శాస్త్రవేత్తలు, అభ్యుదయ రైతులు, విస్తర్ణ విభాగంలో అధికారులకు ప్రతి సంవత్సరం రైతు నేస్తం అవార్డులతో ఘనంగా సత్కరిస్తున్నారు. ఈ సంవత్సరం కూడా రైతునేస్తం 19వ వార్షికోత్సవ సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లోని గన్నవరం ఆత్కూర్‌లో స్వర్ణభారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు పాల్గొని శాస్త్రవేత్తలకు అవార్డులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు చేతులమీదుగా రైతునేస్తం పద్మశ్రీ అవార్డును అందుకున్నట్లు మండలంలోని కేవీకే గడ్డిపల్లి మృత్తిక శాస్త్రవేత్త ఎ.కిరణ్ వెల్లడించారు. రైతులను సేంద్రియ వ్యవసాయపై చైతన్యం చేయడం, వ్యవసాయ అనుబంధ రంగాల్లో విస్తృత కార్యక్రమాలను సమర్ధంగా నిర్వహించినందుకు గాను ఈ అవార్డును పొందినట్లు తెలిపారు. కార్యక్రమంలో రైతునేస్తం వ్యవస్థాపకుడు యడ్లపల్లి వెంకటేశ్వరరావు, ట్రస్ట్ చైర్మన్, మాజీ మంత్రి కామినేని శ్రీనివాసరావు, ముప్పవరపు ట్రస్టు చైర్మన్ ఎం .రాధా, రైతులు తదితరులు పాల్గొన్నారు.

19నుంచి నియోజకవర్గ స్థాయి క్యారమ్ పోటీలు



కరపత్రాలు విడుదల చేస్తున్న నిర్వాహకులు, యూత్‌సభ్యులు

మఠంపల్లి : మండలంలోని భీల్యానాయక్‌తండా పరిధిలోని నిమ్మతండాలో ఈనెల 19నుంచి నియోజకవర్గ స్థాయి క్యారమ్ పోటీలను స్థానిక యూత్ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు ఆదివారం నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పోటీలకు సంబంధించిన కరపత్రాలను స్థానికంగా విడుదల చేసి మాట్లాడారు. ఈ పోటీలు సీనియర్స్, జూనియర్స్ విభాగంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. విజేతలకు సీనియర్స్ విభాగంలో మొదటి బహుమతిగా రూ.5016లు షీల్డు, రెండో బహుమతిగా రూ.3016లు షీల్డు, మూడో బహుమతిగా రూ.2016లు షీల్డు, జూనియర్స్ విభాగంలో మొదటి బహుమతిగా రూ.1516లు షీల్డు, రెండో బహుమతి రూ.1016లు షీల్డు, మూడో బహుమతిగా రూ.516లు షీల్డు అందించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తి గల క్రీడాకారులు 95425 53674, 72868 81717ను సంప్రదించాలన్నారు.

కాంగ్రెస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం

- మాజీ ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి



కోదాడ : కాంగ్రెస్ పార్టీలో చేరిన వారితో మాజీ ఎమ్మెల్యే పద్మావతి

కోదాడ : తెలంగాణ రాష్ట్రంలో నిజమైన అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యపడుతుందని కోదాడ కాంగ్రెస్ అభ్యర్థి నలమాద పద్మావతిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని 22వ వార్డు బీఆర్ఎస్ ఇన్‌చార్జ్ మధు ఆధ్వర్యంలో పలువురు నాయకులు, మహిళా కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి పద్మావతి పార్టీ కండువాలను కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడారు. పార్టీలో చేరిన వారికి తగిన గుర్తింపు ఉంటుందని, వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు కోసం పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో వంగవేటి రామారావు, లక్ష్మీనారాయణరెడ్డి, పారా సీతయ్య, పాలూరి సత్యనారాయణ, వంటిపులి వెంకటేష్, తోట శ్రీను, బాజాన్, షమ్మి, చింతలపాటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిక

మునగాల : మండలంలోని తాడువాయి గ్రామానికి చెందిన ఎలగందుల రాఘవయ్య బీఆర్ఎస్ పార్టీ నుంచి ఆదివారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. బ్లాక్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొలిశెట్టి బుచ్చిపాపయ్య ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే ఎన్.పద్మావతిరెడ్డి సమక్షంలో కోదాడలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా రాఘవయ్యకు ఆమె పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు వేనేపల్లి వీరబాబు, జిల్లేపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఎంపీలు స్థాయికి మించి వైద్యం చేయొద్దు



సమావేశంలో మాట్లాడుతున్న భుజంగరావు

మునగాల : గ్రామీణ ప్రాంతాల్లో ఆర్‌ఎంపీ, పీఎంపీలు తమ స్థాయికి మించి వైద్యం చేయొద్దని రూరల్ మెడికల్ ప్రాక్టిషనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పానుగోటి భుజంగరావు హితవు పలికారు. ఆదివారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన రూరల్ మెడికల్ ప్రాక్టిషనర్స్ అసోసియేషన్ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అనంతరం ఆర్‌ఎంపీ, పీఎంపీలకు జిల్లా నుంచి మంజూరైన ఐడీకార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మండలంలోని కలకోవ గ్రామానికి చెందిన దొంతగాని రవిబాబును జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీగాను, మండల కార్యదర్శిగా చిరందాసు ఉపేంద్రను ఎన్నుకున్నారు. సమావేశంలో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి గుణగంటి వెంకన్నగౌడ్, క్రమశిక్షణ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎస్వీ వెంకటప్పయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ మన్సూర్‌అలీ, నియోజకవర్గ పరిధిలోని ఆరు మండలాల అధ్యక్ష, కార్యదర్శులు, మండల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట రైతుల ఆందోళన



సబ్‌స్టేషన్‌లో ఆందోళన చేస్తున్న రైతులు

మేళ్లచెరువు : మండలంలోని విద్యుత్ కోతలు ఎక్కువగా ఉండడంతో ఆదివారం స్థానిక సబ్‌స్టేషన్ ఎదుట మండలంలోని వేపలమాధవరం గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్ సక్రమంగా ఇవ్వకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో మండలంలో తెలియని పరిస్థితి నెలకొందని వాపోయారు. అధికారులు విద్యుత్ సక్రమంగా అందించకుండా తమ గోడును పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా విద్యుత్ ఇచ్చే సమయాన్ని రైతులకు తెలపాలని, అదే విధంగా విద్యుత్ సరఫరాను పెంచి పంటలు ఎండిపోకుండా చూసి ఆదుకోవాలని వారు కోరారు.

రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సైదులు

గరిడేపల్లి : హైదరాబాద్‌లో ఈనెల 29, 30తేదీల్లో నిర్వహించే ఏఐవైఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడు పంగా సైదులు కోరారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. యువతి, యువకులు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించి నిరుద్యోగుల తరుపున ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో అనేక పోరాటాలకు సిద్ధమవుతున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో విద్యా, వైద్యం, ఉపాధి కల్పించడంలో రాష్ట్రంలో పెద్ద కుంభకోణం జరుగుతుందన్నారు. హైదరాబాద్‌లో విద్యార్థి ప్రవళిక ఆత్మహత్య చేసుకోవడం చాలా బాధాకరమన్నారు. సమావేశంలో బొడ్డిపల్లి నరేష్, మెండు లింగరాజు, జానపాటి పృథ్వీ, రహీం, మధు, వేణు, అలీమ్, రమణ, గోపి, అశోక్ తదితరులు ఉన్నారు.

బీఆర్ఎస్ మేనిఫెస్టోపై హర్షం



హర్షం వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుజూర్‌నగర్ : అన్ని వర్గాల ప్రజల అవసరాలు తీర్చేలా బీఆర్ఎస్ మేనిఫెస్టో ఉండడం హర్షనీయమని ఆ పార్టీ నాయకులు అన్నారు. బీఆర్ఎస్ మేనిఫెస్టో విడుదలపై ఆదివారం పట్టణంలో నాయకులు స్థానిక వివేకానంద సెంటర్‌లో బాణాసంచా కాల్చి హర్షం వ్యక్తం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. సీఎం కేసీఆర్ రాబోయే ఐదేండ్లలో పక్కా ప్రణాళికతో అన్ని వర్గాల ప్రజల అవసరాలు తీర్చేలా, రాష్ట్ర ప్రగతికి తోడ్పడేలా మేనిఫెస్టోను తీర్చిదిద్దారని అన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు అమర్‌నాథ్‌రెడ్డి, అమరగౌడ్, మున్సిపల్ వైస్‌చైర్మన్ నాగేశ్వరరావు, కౌన్సిలర్లు కె.శ్రీను, జె.శంభయ్య, వి.నాగేశ్వరరావు, డి.మంగమ్మ, వీరారెడ్డి, ఉపేంద్ర, సైదులు, వార్డు ఇన్‌చార్జ్‌లు, పట్టణ యువజన కమిటీ, మహిళా, అనుబంధ సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

చిలుకూరు: చిలుకూరు బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం తెల్లవారుజామున రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్ చోరీకి గురైంది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. చిలుకూరు గ్రామంలోని బస్టాండ్ సెంటర్‌లో నివాసముంటున్న మీసేవా కేంద్రం నిర్వాహకుడు మండవ వీరబాబు తన రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను రోజుమాదిరిగానే ఇంటి ఎదుట పార్కింగ్ చేశాడు. ఆదివారం తెల్లవారుజామున ముగ్గురు వ్యక్తులు బైక్‌పై వచ్చి రాయల్ ఎన్‌ఫీల్డ్ బైక్‌ను చోరీ చేశారు. చోరీ చేసిన బైక్‌తో కోదాడ వైపు వెళ్లినట్లు సీసీ కెమెరాలో రికార్డయ్యింది. దీంతో బాధితుడు చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

దుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలు ప్రారంభం



హుజూర్‌నగర్ : ఊరేగింపులో నృత్యాలు చేస్తున్న మహిళలు



మట్టపల్లిలోని వేదపాఠశాలలో పూజలు చేస్తున్న వేదవిద్యార్థులు



నేరేడుచర్ల మండలంలోని దిర్శించర్ల గ్రామంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



గరిడేపల్లి : పూజలు చేస్తున్న భక్తులు

హుజూర్‌నగర్ : శ్రీకనకదుర్గాదేవి శరన్నవరాత్రోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పట్టణంలోని సీతారాంనగర్‌లో శ్రీదుర్గామాత ప్రతిష్టాపన ఉత్సవాలను నిర్వహించారు. అనంతరం అభయాంజనేయ స్వామి ఆలయంలో కనకదుర్గమ్మ విగ్రహానికి భక్తులు పూజలు నిర్వహించారు. ఆడపడుచుల నృత్యాలతో అంగరంగ వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, నిర్వాహకులు, మహిళలు పాల్గొన్నారు.

శ్రీ బాలా త్రిపురసుందరీ దేవిగా అమ్మవారు

పట్టణంలోని శ్రీ కనకదుర్గ అమ్మవారి దేవాలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఇందులో భాగంగా ఆదివారం అమ్మవారికి ఉదయం సుప్రభాతసేవ, గణపతి పూజ, కలశస్థాపన, పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం అమ్మవారు శ్రీ బాలా త్రిపురసుందరీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇచ్చారు. అర్చకులు రంగ భట్టాచార్యులు విశేష పూజలు చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

నేరేడుచర్ల : దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పట్టణంలోని విజయదుర్గ ఆలయం, శివాజీనగర్‌లోని నవరాత్రి ఉత్సవ కమిటీ, దిర్శించర్లలోని ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అమ్మవారిని ఘనంగా ఊరేగించి ప్రతిష్టించారు. సుప్రభాత సేవ, గోపూజ, విఘ్నేశ్వరపూజ, పుణ్యావచనం, పంచాగవ్య ప్రశనం, దీక్షాధారణ, అఖండ జ్యోతి స్థాపన, భగత్ ధ్వజారోహన, కలశ స్థాపన, రుద్రాభిషేకాలు వంటి పూజలను నిర్వహించారు. అమ్మవారిని మొదటి రోజు బాల త్రిపురసుందరి దేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

చిలుకూరు : మండలంలోని ఆయా గ్రామాల్లో ఆదివారం కనకదుర్గమ్మ అమ్మవారి నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా కనకదుర్గమ్మ అమ్మవారి విగ్రహాలు ప్రతిష్టించి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నడిగూడెం : మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం దేవీ నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా అమ్మవారికి దూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో దుర్గాదేవి విగ్రహాలను ప్రతిష్టించి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ఉత్సవ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

మేళ్లచెరువు : దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా మండల కేంద్రంలోని శ్రీ వనదుర్గ దేవాలయంలో, శ్రీ స్వయంభు శంభులింగేశ్వర స్వామి దేవాలయాల్లో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి గణపతిపూజ, పుణ్యావచనం, చండీపారాయణ సహస్రనామార్చనలు, కంకుమార్చనలు, శ్రీచక్రరార్చనలు, కుంకుమపూజ, వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

స్వర్ణ కవచ అలంకృతావతారంలో అమ్మవారు

మఠంపల్లి : దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో కనకదుర్గమ్మ అమ్మవారు ఆదివారం స్వర్ణ కవచాలంకృత అవతారంలో ఘనంగా పూజలందుకున్నారు. ఈ సందర్భంగా మట్టపల్లిలోని వేదపాఠశాలలో వేదవిద్యార్థులు కలశస్థాపన, పంచామృతాలతో అభిషేకం, విశేష పూజలు, వేదపారాయణం చేశారు. అదే విధంగా మఠంపల్లిలోని కనకదుర్గమ్మ దేవాలయంలోఅమ్మవారికి అర్చకులు, మహిళలు కుంకుమ పూజలు నిర్వహించి అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అర్చకులు సోమయాజుల సూర్యనారాయణమూర్తి శాస్త్రి, భక్తులు, విద్యార్థులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



మఠంపల్లి : పూజల్లో పాల్గొన్న భక్తులు



చిలుకూరులో ప్రతిష్ఠించిన అమ్మవారు



నడిగూడెంలో పూజలు నిర్వహిస్తున్న మహిళలు

ప్రవళికది ఆత్మహత్య కాదు ప్రభుత్వ హత్యే



టీఎస్‌పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

నడిగూడెం : ప్రవళికది ఆత్మహత్య కాదని, ప్రభుత్వ హత్యేనని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాసాని కిశోర్ ఆరోపించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం టీఎస్ పీఎస్సీ చైర్మన్ జనార్దన్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఇటీవల వరుసగా పోటీ పరీక్షలు రద్దు కావడంతోనే తీవ్ర మనస్థాపానికి గురైన ప్రవళిక మానసిక ఆవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడిందన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ప్రవళిక కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని, అదే విధంగా రూ.50లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆ సంఘం మండల అధ్యక్షుడు కేశగాని భద్రయ్య, కార్యదర్శి జమ్మి యల్లయ్య, నాయకులు నోసిన అంజి, కాసాని రాంబాబు, చైతన్య, గోలి శ్రీకాంత్, తిరుమలేష్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలను విజయవంతం చేయాలి

గరిడేపల్లి : మండల కేంద్రంలో ఫ్రెండ్స్ యూత్, పోనుగోడు వారి ఆధ్వర్యంలో నేడు నిర్వహించే ఉమ్మడి నల్లగొండ జిల్లా క్రికెట్ పోటీలను విజయవంతం చేయాలని ఫ్రెండ్స్ యూత్ సభ్యులు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు ప్రథమ బహుమతి రూ.30,016లు, ద్వితీయ బహుమతి రూ.20,016లు, తృతీయ బహుమతి రూ.15,016లు, చతుర్థ బహుమతి రూ.10,016లు ఇవ్వనున్నట్లు తెలిపారు.

మిన్నయ్య మృతి పార్టీకి తీరనిలోటు

హుజూర్‌నగర్ : పట్టణానికి చెందిన కాంగ్రెస్ కార్యకర్త తండు మిన్నయ్యగౌడ్ మృతి పార్టీకి తీరనిలోటని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యరగాని నాగన్న అన్నారు. ఆదివారం మిన్నయ్య మృతి చెందడంతో ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు. సంతాపం తెలిపిన వారిలో కౌన్సిలర్ జక్కుల వీరయ్య, మాజీ కౌన్సిలర్ చింతకాయల రాము, పట్టణ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు జక్కుల మల్లయ్య పాల్గొన్నారు.

ఇసుక టిప్పర్ బోల్తా

మేళ్లచెరువు : మండలంలోని రేవూరు గ్రామంలో ఆదివారం తెల్లవారుజామున ఇసుకతో వెళ్తున్న టిప్పర్ బోల్తా పడింది. వివరాల ప్రకారం.. ఆంధ్రా ప్రాంతం నుంచి మండలానికి ఇసుక తరలిస్తున్న ఓ టిప్పర్ గ్రామం మధ్యలో రోడ్డు దిగడంతో కేబుల్ లైన్ కొరకు తీసిన పైప్‌లైన్ లో దిగబడి బోల్తా కొట్టింది. ఈ ఘటనలో ఎవరికి ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. వ్యాపారులు అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తీసుకొచ్చినట్లు సమాచారం.

చెస్‌తో విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందుతుంది

సూర్యాపేటటౌన్ : చెస్‌తో విద్యార్థుల్లో మేధాశక్తి పెంపొందుతుందని జిల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు గండూరి కృపాకర్ అన్నారు. జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని కిరాణా మర్చంట్ అసోసియేషన్ భవన్‌లో ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి ఓపెన్ చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రోత్సహించాలన్నారు. అనంతరం విజేతలకు నగదు బహుమతితో పాటు షీల్డ్స్ అందజేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

మఠంపల్లి : మండలంలో స్థానిక పోలీసులు నిర్వహించిన వాహనాల తనిఖీల్లో ఆదివారం 6క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం, 60కేజీల నల్ల బెల్లం, 10కేజీల పటికను స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం తుమ్మలచెరువుకు చెందిన బలిగిరి కోటయ్య, నాగరాజు, గోవిందమ్మ మండలంలోని బక్కమంతులగూడెంలో సేకరించిన 6క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని ఆంధ్రా ప్రాంతానికి అక్రమంగా తరలిస్తుండగా బక్కమంతులగూడెం స్టేజీ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు.

60కేజీల నల్లబెల్లం, 10కేజీల పటిక..

అదే విధంగా మండలంలోని కాల్వపల్లితండాకు చెందిన బానోతు నాగునాయక్ మఠంపల్లి నుంచి అక్రమంగా 60కేజీల నల్లబెల్లం, 10కేజీల పటిక తరలిస్తుండగా పట్టుకున్నట్లు తెలిపారు. కాగా వారిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

క్లుప్తంగా

ఏపీజే అబ్దుల్‌కలాం జయంతి



ఏపీజే అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాల వేస్తున్న ట్రస్టు సభ్యులు

హుజూర్‌నగర్ : మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని ఆదివారం పట్టణంలో డీఎస్ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్ట్ సభ్యులు కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ డి.బాబురావు, సభ్యులు తిరుపతి, నరసింహారావు, వెంకటనారాయణ, చంటి, ముస్తఫా, వెంకన్న, ప్రవీణ్, గణేష్, మనోహర్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సాయిబాబా విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు



ఆలయంలో సామూహిక వ్రతాలు నిర్వహిస్తున్న భక్తులు

నేరేడుచర్ల : మండలంలోని దిర్శించర్లలో సాయిబాబా మందిరంలో ఘనంగా సాయిబాబా విగ్రహాన్ని ఆదివారం ప్రతిష్ఠించారు. ఈ సందర్భంగా భక్తులు ప్రత్యేక హోమాలు, సామూహిక వ్రతాలు నిర్వహించారు. అనంతరం కమిటీ సభ్యులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు జూలూరి అశోక్, శ్రీనివాస్, నర్సింహారావు, నాగేశ్వర్‌రావు, శ్రీనివాస్ తదితరులున్నారు.

ఉత్తమ సేవలు అందించిన పాస్టర్‌కు సన్మానం



పాస్టర్ దంపతులను సన్మానిస్తున్న ట్రస్టు సభ్యులు

మునగాల : క్రైస్తవ్యంపై సామాజికంగా, ఆత్మీయంగా తెలంగాణ, ఆంధ్ర, కేరళ రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో 45సంవత్సరాలుగా విశిష్ట సేవలు అందిస్తున్న బిషప్ ముల్లంగి జాకబ్‌ను ఆదివారం మండలానికి చెందిన ఆశీర్వాద్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండల కేంద్రంలో నిరీక్షణ ప్రార్థన మందిరంలో జరిగిన కార్యక్రమంలో జాకబ్‌రాజ్ -వనజ దంపతులను పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా సివిల్ సప్లయి అసిస్టెంట్ మేనేజర్ కె.బెనర్జీ, ఆశీర్వాద్ చారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు అరివేణుల లెనిన్, కస్తూరిబా పాఠశాల టీచర్ జ్యోతి, విజయ పాల్గొన్నారు.


గ్రామ కమిటీ ఎన్నిక



సమావేశంలో పాల్గొన్న నాయకులు

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని మర్రిగూడెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ యూత్, ఐఎన్‌టీయూసీ కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడు షేక్ మౌలానా తెలిపారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గల్లా శ్రీనివాస్, సన్నిది నవీన్, ఐఎన్‌టీయూసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ జానివియా, గల్లా నర్సింహారావు ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలో పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ అజ్మతుల్లా, ఆదినారాయణ, వెంకటనర్సు, ఇబ్రహీం, పిచ్చయ్య, నాగేశ్వరావు, శ్రీను, మల్లేష్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గ ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న కమిటీ సభ్యులు

మునగాల : మండల కేంద్రంలో ఆర్‌ఎంపీ, పీఎంపీ సంక్షేమ సంఘం మండల నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పుష్పల లక్ష్మీనరసయ్య, పోలిశెట్టి రాజేందర్ సమక్షంలో జరిగిన కార్యక్రమంలో అధ్యక్షుడిగా వెలిదె వెంకటప్పయ్య చారి, ప్రధాన కార్యదర్శిగా దాచేపల్లి మురళీకృష్ణ, కోశాధికారిగా భిక్షం ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బెల్లంకొండ డాంగే, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ రహమతుల్లా, రాష్ట్ర నాయకులు అనంతారపు బ్రహ్మం, మండల మహిళా ఆర్‌ఎంపీ పిల్లి రాణి, మండలంలోని ఆర్‌ఎంపీ, పీఎంపీలు తదితరులు పాల్గొన్నారు.